క్లుప్తంగా

మోదమాంబను దర్శించుకున్న అధికారులు



మోదమాంబను దర్శించుకుంటున్న ఆర్‌అండ్‌బీ ఈఈ విద్యాసాగర్ తదితరులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబను ఆర్‌అండ్‌బీ ఈఈ విద్యాసాగర్, బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. వీరితో పాటు మాడుగుల ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పైలా దేముడునాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, స్థానిక నాయకులు పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

చురుగ్గా అమ్మవారి ఆలయాల నిర్మాణం



వీరనారాయణం గ్రామంలో నిర్మాణంలో వున్న ఆలయాలు

మాడుగుల రూరల్ : మండలంలో వీరనారాయణం గ్రామంలో నూతనంగా ముత్యమాంబ, పరిదేశమాంబ ఆలయాల నిర్మాణం చురుగ్గా సాగుతున్నాయి. గ్రామ శివార్లలో ఈ ఆలయాలు నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆలయ అభివృద్ధి నిర్వాహకులు తురుబిల్లి రామారావు కోరారు. ఈ రెండు ఆలయాలు నిర్మాణంలో ఉన్నాయి.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి తదితరులు

మాడుగుల : జాలంపల్లి పంచాయతీ శివారు గ్రామం సిరిపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో గిరిజన ప్రజలు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామంలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి గిరిజన ప్రజలకు దాహం తీర్చాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చెదల రాధ, కొర్రా బీమేషమ్మ, చెదల కృష్ణ, చిత్రాల సన్యాసిరావు, కిల్లో కాంతమ్మ, కిల్లో సత్తిబాబు, కొర్రా సుందరరావు, పాల్గొన్నారు.

22న ఉపాధి పనులపై ప్రజా వేదిక



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషాశ్రీ

నాతవరం : ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 22వ తేదీన ప్రజావేదిక ఉంటుందని ఎంపీడీవో ఉషాశ్రీ అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీలో భాగంగా 17వ విడత మండలంలో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు చేసిన పనుల్లో సామాజిక తనీఖలు చేసారన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం వరకు 31 గ్రామ పంచాయతీల్లో క్షేత్ర స్థాయి తనిఖీలు చేస్తారన్నారు. అనంతరం మరుసటి రోజున మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో డ్వామా ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో ప్రజా వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీని ప్రారంభిస్తున్న పోస్ట్‌మాస్టర్ సింహాద్రినాయుడు

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో పది పబ్లిక్ పరీక్ష కేంద్రం వద్ద సత్యసాయి భక్తులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా పరీక్ష అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బందికి సత్యసాయి భక్తులు మజ్జిగను అందించారు. మజ్జిగ పంపిణీని కె.సంతపాలెం పోస్ట్‌మాస్టర్ చల్లా సింహాద్రినాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా సేవా సహ సమన్వయకర్త అప్పలనాయుడు, కె.కోటపాడు సమితి కన్వీనర్ నారాయణపాత్రుడు పాల్గొన్నారు.



పెదమదీన రోడ్డులో జరుగుతున్న విద్యుత్ పనులు



బీఎన్ రోడ్డును ఆనుకుని వేస్తున్న విద్యుత్ స్తంభాలు

రోడ్డెక్కిన విద్యుత్ స్తంభాలు!

- విద్యుత్ పనుల్లో నిబంధనలు బేఖాతర్
- రోడ్లను ఆనుకుని వేస్తున్న విద్యుత్ స్తంభాలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



కొండెంపూడి రోడ్డులో విద్యుత్ లైన్ కోసం నరికివేసిన పచ్చని చెట్లు

బుచ్చెయ్యపేట : గ్రామాలకు నిరంతర విద్యుత్ ఏర్పాటు పనుల్లో నిబంధనలు పాటించడం లేదు. విద్యుత్ ఏర్పాటులో తీసుకుంటున్న శ్రద్ధ వాటి ప్రమాణాలపైన, ప్రమాదాల నివారణపై చూడడం లేదు. గుత్తేదారు వేగవంతంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి నిధులు రాబట్టుకోవడంలోనే శ్రద్ధ చూపుతున్నారు తప్ప నాణ్యతను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ఉన్న 35 పంచాయితీ గ్రామాలతో పాటు మరో 15 శివారు గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నర్సీపట్నం, భీమునిపట్నం(బీఎన్) రోడ్డు, కశింకోట, బంగారుమెట్ట(కేబీ) రోడ్డు, రాజాం, తట్టబంద (ఆర్టీ) రోడ్డు, మల్లాం, కొండెంపూడి, కొండపాలెం తదితర రహదారుల్లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ స్తంభాలను తారు రోడ్డును ఆనుకుని వేస్తున్నారు. తారురోడ్డు నుంచి రోడ్డు మార్జిన్ చివర్లో ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలను తారు రోడ్డుకు అర అడుగు నుంచి మూడు అడుగుల దగ్గరలోనే పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు ఎదురెదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి విద్యుత్ స్తంభాలను ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట కొత్తగా వేస్తున్న విద్యుత్ స్తంభాలను గుర్తించక వాహనాల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- ఇటీవల రాజాం చెరువు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన కారు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. విద్యుత్ స్తంభం కారుమీదనే పడిపోవడంతో కారు పూర్తిగా దెబ్బతినగా కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.
- నీలకంఠాపురం, కూండ్రం మధ్యలో క్వారీ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది.
- బీఎన్ రోడ్డులో శింగవరం వద్ద లారీ ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం విరిగింది.

పలు గ్రామాల వద్ద వాహనదారులు రోడ్లకు దగ్గరలో వేస్తున్న విద్యుత్ స్తంభాల వల్ల రోజూ భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. స్తంభాలు వేస్తున్నపుడే ప్రమాదాలు జరుగుతున్నాయి. పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా అయితే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెదమదీన, గున్నెంపూడికి వేస్తున్న స్తంభాలు మట్టి రోడ్డు అంచున వేస్తున్నారు. వర్షాకాలంలో ఏ మాత్రం గాలివీచినా ఈ స్తంభాలు పక్కకు ఒరిగిపోయి ప్రమాదాలు జరుగుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



రాజాం వద్ద రోడ్డును ఆనుకుని వేసిన విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారుపైనే పడ్డ విద్యుత్ స్తంభం

పచ్చదనానికి గొడ్డలిపెట్టు

కేపీ ఆగ్రహారం, కొండపాలెం, కొండెంపూడి, తురకలపూడి, పెదపూడి తదితర రూటులో విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు పేరుతో అవసరం లేని రోడ్డు పక్కన పచ్చని నీడనిచ్చే చెట్లు నరికేసి కొంతమంది కలపను అమ్ముకుంటూ పచ్చదనాన్ని హరింపజేస్తున్నారు. నిరంతర విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు ప్రమాణాల మేరకు జరిగేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై వడ్డాది విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ రాజును వివరణ కోరగా విద్యుత్ లైన్ ఏర్పాటు ప్రైవేటు కాంట్రాక్టర్ చేపడతున్నాడని మాకు ఇంకా అప్పగించలేదని అన్నారు.

31తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరి

మాడుగుల/నాతవరం/మాకవరపాలెం: రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఆయా మండల తహసీల్దార్‌లు రమాదేవి, వేణుగోపాల్, మాకవరపాలెం ఇంచార్జి తహసీల్దార్ రామారావు వేర్వేరుగా తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోపు తమ పరిధిలో గల చౌక దుకాణం వద్దకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేయించుకోవలసి ఉంటుందన్నారు. ఈకేవైసీ చేయించుకోకపోతే వచ్చే నెల రేషన్ నిలుపుదల చేస్తారన్నారు. నాతవరం మండలంలో మొత్తం 58,325 యూనిట్లు ఉన్నాయన్నారు.వాటిలో ఇంతవరకు 55,658 మంది ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకున్నారన్నారు. ఇంకా 5,562 మంది ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ స్థానిక సచివాలయంలో లేక వీఆర్వో రేషన్ డీలర్లు చేస్తారన్నారు.

142 మందికి ఉచిత వైద్య సేవలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల మేజర్ పంచాయతీ వడ్డాదిలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 142 మందికి వైద్య సేవలు అందించారు. విశాఖ శంకర్ ఫౌండేషన్ సిబ్బంది వెంకట పద్మావతి మెడికల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో పలు గ్రామాల కంటి రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. వీరిలో 29 మందికి తీవ్ర కంటి సమస్య ఉండటంతో శస్త్ర చికిత్సలకు తరలించారు. వైద్య సిబ్బంది అరుణ్‌కుమార్,శివకుమార్ పాల్గొన్నారు.

రెండో రోజు పరీక్షలు ప్రశాంతం

మాడుగుల రూరల్: పదో తరగతి పరీక్షలు రెండో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. హిందీ పరీక్షకు 705 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కాగా, ఒక ప్రైవేటు విద్యార్థి హాజరయ్యారని స్థానిక ఎంఈవో -2 బి. దేముడమ్మ తెలిపారు. కె.జె.పురం పరీక్ష కేంద్రంలో 162 మందికి ఒకరు గైర్హాజరు కాగా, ఒమ్మలి కేంద్రంలో 153 మందికి పూర్తిగా హాజరయ్యారు. తాటిపర్తి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో 151 మందికి 149 మంది హాజరయ్యారు. మాడుగుల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 105 మందికి 104 మంది, బాలికల పాఠశాలలో 138 మందికి పూర్తిగా హాజరైనట్టు ఎంఈవో తెలిపారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

చీడికాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో పోస్టుల గురించి వైద్యాధికారి సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీలు గురించి అడిగి తెలుసుకున్నారు. పెదగోగాడ పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బందిని సర్దుబాటులో భాగంగా స్టాఫ్‌నర్స్‌ని ఈ పీహెచ్‌సీకి డిప్యూటేషన్ చేస్తానని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీలో రోజువారీ ఓపి సంఖ్యను పెంచాలని, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలని, గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.



చీడికాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో రవికుమార్

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు క్షేమదాయకం

కె.కోటపాడు : గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలను నిర్వహించుకోవడం క్షేమదాయకమని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆనందపురం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను ఆమె నిర్వహించారు. 79 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయించుకోవడం వల్ల తల్లిబిడ్డల ఆరోగ్యం క్షేమంగా ఉంటుందని వివరించారు. వృద్ధులు, చిన్నారులు వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్‌ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎన్‌ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చిన్నారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ

గోవాడ సుగర్స్‌కు రూ.100 కోట్లు మంజూరు చేయాలి

మాడుగుల రూరల్ : రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని గాడిలో పెట్టి, కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీ సభ్యరైతులు, కార్మికులు, ఫ్యాక్టరీ అభివృద్ధికి రూ. 100 కోట్లు నిధులు మంజూరు చేయాలని మాడుగుల నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ పరిధిలో గల దేవరాపల్లి మండలం, కొత్తపెంటలో చెరకు రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, చెరకును సకాలంలో క్రషింగ్ చేయాలేకపోయామని మనస్తాపం చెంది చెరకు తోటకు నిప్పుపెట్టిన ఘటన పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 23 వేల మంది రైతులు, మరో 300 మంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్నారని, క్రషింగ్‌లో సాంకేతిక లోపాల వల్ల ఒక టన్ను చెరకు 15 రోజుల పాటు కాటాల వద్ద ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సాంకేతిక పరమైన సమస్యలకు చెక్ పెట్టాలని, తోలిన చెరకుకు సకాలంలో పేమెంట్లు ఇవ్వాలని, కార్మికులకు జీతాలు ఇవ్వాలని ఆయన ఫ్యాక్టరీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

మాలమహానాడు ఆందోళన

చోడవరం : ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. చోడవరం కొత్తూరు జంక్షన్ సమీపంలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా మెయిన్‌రోడ్డుపై ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వం వన్‌మ్యాన్ కమిషన్ వేయడం దురదృష్టకరమన్నారు. వర్గీకరణ జరిగితే ప్రధానంగా మాల కులస్తులు ఎక్కువగా నష్టపోతారని, వర్గీకరణ చేయకుండా ఎస్సీలందర్నీ ఐక్యంగా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కార్యాలయానికి అందజేశారు. ఆందోళనలో అనకాపల్లి జిల్లా కమిటీ అధ్యక్షుడు వేచలపు సహదేముడు, ప్రధాన కార్యదర్శి రెల్లి తాతారావు, రాంజీ, గిరి, వెంకటరమణ పాల్గొన్నారు.



చోడవరం మెయిన్‌రోడ్డుపై ధర్నా చేస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించాలి

రావికమతం: జీడి పిక్కలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ బంగారు బంద నుంచి ఆజయపురం వరకు గిరిజనులు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. చీమలపాడు పంచాయితీ పరిధిలో 13 గ్రామాల్లో ఎస్టీ కొండదొర, భగత, వాల్మీకి వంటి తెగలు 600 కుటుంబాలు జీవిస్తున్నారు. వీరు జీడి తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

ఈ మధ్య కాలంలో జీడి తోట పూత మాడిపోవడంతో 75 శాతం పంట పూర్తిగా నష్టపోయిందని, పోయిన పంటకు నష్ట పరిహారం ఇవ్వాలని, మిగిలిన పంటకు మద్దతు ధర ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గభ్యులు గోవిందరావు డిమాండ్ చేశారు.



పాదయాత్ర చేస్తున్న గిరిజనులు

నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

నాతవరం : మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు కలెక్టరు ఆదేశాల ప్రకారం ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని ఎంపీడీవో ఉషాశ్రీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 4జీ సర్వే విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని, బోర్లు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, బోర్లలో అదనపు పైపులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంటు పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూకాలతల్లి గరగలు ఊరేగింపు



గరగలు ఊరేగిస్తున్న దృశ్యం

గొలుగొండ : లింగంపేట నూకాలతల్లి అమ్మవారి గరగలు(ఘటాలు)ఊరేగింపు కార్యాక్రమం బుధవారం నిర్వహించారు. ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లింగంపేట నుంచి గొలుగొండ వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి గ్రామంలో మహిళలు నీళ్ల బిందెలతో స్వాగతం పలికారు. ఈ ప్రాంతంలో ఇలవేల్పుగా పేరున్న లింగంపేట నూకాలమ్మతల్లి పండగ ఈనెల 28 నుంచి వారం రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. ముందుగా అమ్మవారం ఘటాలు ఊరేగింపు నిర్వహించి పండగను ప్రారంభం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ఎంపీపీ అడిగర్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, లింగంపేట ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవోలు

రోలుగుంట : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని ఎంఈవో 1, జానుప్రసాద్, ఎంఈవో-2, జగ్గారావు విడివిడిగా బుధవారం పర్యవేక్షించారు. పరీక్ష విధానాన్ని పరిశీలించారు. పరీక్ష నిర్వహణ సమయం కచ్చితంగా అమలు చేయాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్ష రాస్తున్న విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ నేత వెంకటరావు మృతికి సంతాపం



వెంకటరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: కాశీపురంలో ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాసరి వెంకటరావు సంతాప కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు వెంకటరావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దాసరి గోపి, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎం.అలమండ ఎంపీటీసీ పోతల వెంకటరావు, సీనియర్ నాయకులు లలితానాయుడు, కొట్టాన వెంకటరమణ, దేముడునాయుడు సంతాపం వెలిబుచ్చారు.

వేసవిలో పశుసంరక్షణకు జాగ్రత్తలు అవసరం

కె.కోటపాడు : పాడి రైతులు వేసవికాలంలో పశుసంరక్షణపై జాగ్రత్తలను పాటించాలని, తద్వారా పశువులు వ్యాధుల బారిన పడకుండా పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చునని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో బుధవారం ఆయన పాడి రైతులకు పలు సూచనలను చేశారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వల్ల పశువులను రైతులు ఉదయం 10 గంటలు లోగా మేతకు తీసుకువెళ్లాలని మరలా సాయంత్రం 4 గంటల తరువాత బయటకు తీసుకువెళ్లడం వల్ల వేసవి ఉష్ణోగ్రతల బారిన పశువులు పడకుండా చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు నీటితో రెండు సమయాల్లోను శుభ్రపర్చాలని తెలిపారు. తద్వారా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నట్టు దినేష్‌కుమార్ తెలిపారు. అలాగే పశువులను మధ్యాహ్నం సమయాల్లో గాలి, వెలుతురు తగిలే ప్రాంతాల్లోను, చెట్ల కింద ఉంచాలని ఆయన సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా పశువులకు తాగేందుకు మంచి నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రధానంగా పశువులకు మేతగా పచ్చగడ్డి, టీఎంఆర్ దాణా, సూపర్ నెపీయర్ గడ్డిని ఇవ్వాలన్నారు. పాడి రైతులకు త్వరలోనే రాయితీపై గడ్డి విత్తనాలను అందించే చర్యలను తీసుకోనున్నామని అన్నారు. ఈ నెల 30 వరకూ గాలికుంటు టీకాలతో పాటు పశు బీమా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు

గొలుగొండ : గ్రామ పంచాయతీ, మండల స్థాయి కార్యాలయాల్లో అధికారులు గౌరవ సభ్యులకు గౌరవం ఇవ్వడం లేదని, గౌరవ సభ్యులకు ప్రొటోకాల్ పాటించలేదని జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆరోపించారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి ఆధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు తీర్మాణాలు లేకుండా కూటమి నేతలు ఏకపక్షంగా పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గత ఏడాది ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల్లో పూడికతీత తీసిన వాటి వద్దే మరలా పనులు నిర్వహించి రైతులకు ఉపయోగం లేకుండా చేస్తున్నారని నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆరోపించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజి, వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణితో పాటు ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

22 నుంచి కేజీబీవీల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు

మాడుగుల : ఈ నెల 22 వ తేదీ నుంచి కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక ఎస్‌వో విజయ సాక్షికి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను, 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం 7, 8, 9, తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల కోసం ఈ నెల 22 వ తేదీ నుండి వచ్చే నెల 11 వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్ పిల్ల లు, పేద, ఎస్‌సీ ఎస్‌టీ, బీసీ, మైనారిటీ బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మా త్రమే అడ్మిషన్ కొరకు పరిగణిస్తారని తెలిపారు.

కె.కోటపాడు : మండలంలో గల కింతాడ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.చిన్నమ్ములు కోరారు. పాఠశాలలో 7,8,9,10 తరగతు లలో ఆన్‌లైన్‌లో గల ఖాళీలను బట్టి ఆయా తరగతు ల్లో చేరే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూవో కోర్సు లో చేరే విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈ నెల 22 నుండి ఏప్రిల్ 11 వరకూ స్వీకరిస్తున్నట్టు తెలిపారు. బడి బయట చదువులు పొందలేని బాలికలు, దారిద్ర రేఖకు దిగువ ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వలస కార్మికులలో తల్లిదండ్రులలో ఒకరే ఉన్నవారు అర్హులని తెలిపారు. కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 20 వేల ఆదాయం లోపు ఉన్న వారు మాత్రమే అర్హులని అన్నారు.

రోలుగుంట: 2025-26 విద్యా సంవత్సరానికి కేజీబీవీలో ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్టు స్థానిక కెజీబీవీ ఎస్‌వో తులసి ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు నుంచి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7,8,9 ,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 7075159996, 7075039990 ను సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో సారాను అరికట్టాలి

రావికమతం : నాటు సారా తయారీ ,విక్రయాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్, సారా రహిత గ్రామాలుగా మారాలని అనకాపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్‌శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్(ఈఎస్‌టీఎఫ్) ఎస్. చంద్రశేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి రావికమతం మండలం కుముందానిపేట, మేడివాడ, పిల్లవానిపాలెం గ్రామాల్లో నాటు సారాకు వ్యతిరేకంగా గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. సారా సంబంధిత ఫిర్యాదులు 14405 టోల్‌ఫ్రీ నెంబరుకి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్, వి.మాడుగుల ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రశేఖర్